సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



ఇదే..మొదటిసారి..!

సీతంపేట ఐటీడీఏ ఏర్పడి ఐదు దశాబ్దాలైంది. ఇప్పటి వరకు ఇక్కడ ఎటువంటి ఎన్నికల కార్యకలాపాలు నిర్వహించలేదు.

- 8లో



ఆదుకుంటున్న అపర సంజీవని

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, పురిటినొప్పులు వచ్చే సమయంలో ప్రసవం కోసం గర్భిణులకు 108 వాహనాలు అపర సంజీవనిలా నిలుస్తున్నాయి.

- 8లో



జిల్లా ఓటర్లు 7,75,598 మంది

అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో విడుదల చేసిన తుది ఓటరు జాబితా మేరకు పార్వతీపురం మన్యం జిల్లా ఓటర్లు 7,75,598 మంది నమోదై ఉన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

బట్లభద్ర చెరువులో ఏనుగులు



చెరువులో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బట్లభద్ర చెరువు, పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఈ క్రమంలో పామాయిల్, అరటి పంటలు, వరి చేలలో తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రాత్రివేళ వెంకటరాజపురం, సీమనాయుడువలస, బిత్రపాడు పరిసర ప్రాంతాల్లోని పామాయిల్ తోటలో ఏనుగులు తిష్ఠ వేయడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వెంకటరాజపురం, బట్లభద్ర, బిత్రపాడు గ్రామాలకు రాత్రి సమయాన వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉన్నందున పంట పొలాలకు వెళ్లే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ సిబ్బంది హెచ్చరిస్తున్నారు.

108లో గిరిజన మహిళ ప్రసవం



108లో ప్రసవించిన గిరిజన మహిళ

సీతంపేట: మండలంలోని తల్లెబుగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ ఎస్.రాజ్యలక్ష్మి మంగళవారం రాత్రి 108లో ప్రసవించింది. నాలుగవ కాన్పులో పురిటినొప్పులతో ఆమె బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108కి సమాచారం అందజేశారు. దీంతో ఈఎంటీ రమేష్, పైలెట్ శంకరరావులు గ్రామానికి వచ్చి ఆస్పత్రికి ఆమెను వాహనంలో తరలిస్తుండగా పురిటినొప్పులు తీవ్రం కావడంతో సపర్యలు చేస్తున్న క్రమంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో తల్లీబిడ్డలను 108 సిబ్బంది చేర్పించారు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు 108 సిబ్బందిని అభినందించారు.

సివిల్స్ విజేతకు ఎమ్మెల్యే అభినందన



పృథ్విరాజ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: సివిల్స్‌లో సత్తాచాటిన దొనక పృథ్వీరాజ్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. ఆలిండియా స్థాయిలో 493 ర్యాంక్ సాధించి ఈ ప్రాంతానికి ఖ్యాతి తీసుకొచ్చారని ప్రశంసించారు. ఉద్యోగ నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దొనక విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పల్లకి సేవలో ఎమ్మెల్యే జోగారావు



పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధి కొత్తవలసలో నిర్వహించిన స్వామివారి పల్లకి ఊరేగింపులో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని పల్లకి మోశారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. శ్రీరాముని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



గ్రామంలోని ప్రధాన వీధిలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో రూరల్ ఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో తిరుగుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

సార్వత్రిక సమరానికి... సై



- నేటి నుంచి 25 వరకు నామినేషన్లకు ఏర్పాట్లు
- నామినేషన్ల దాఖలుకు నాయకుల ఏర్పాట్లు
- ఒకేదఫాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఖరారు
- వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసాతో సమరోత్సాహం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

సార్వత్రిక సమరానికి తెరలేచింది. గురువారం విడుదల కానున్న 2024 సాధారణ ఎన్నికల నోటిఫికేషన్‌తో సమరశంఖం పూరించే సమయం వచ్చేసింది. రాష్ట్రంలో సంక్షేమ పాలన, అభివృద్ధి పథం విజయవంతంగా కొనసాగించాలంటే వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ తెచ్చుకోవాలనే సత్సంకల్పంతో ఆ పార్టీ నాయకులంతా ఎన్నికల కురుక్షేత్రంలోకి దిగుతున్నారు. గతంలో సుదీర్ఘ కాలం పరిపాలించినా చెప్పుకోవడానికి మంచి పనులేవీ కనిపించక, జెండాలతో జతకట్టినా ఏమి చేస్తామో ప్రజలకు స్పష్టంగా చెప్పలేక ఎదుటివారిపై దుమ్మెత్తిపోయడమే ఏకైక ఎజెండాగా టీడీపీ అధినాయకుడు చంద్రబాబు నుంచి ఆ పార్టీ చిన్నాచితకా నాయకుల వరకూ ఎన్నికల బరిలోకి వస్తున్నారు. మొదటి లిస్టే సూపర్ హిట్ అంటూ నెలరోజుల కిందటే హడావుడి చేసినా ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థి టికెట్ గ్యారెంటో చెప్పలేని టీడీపీ నాయకులు... తమకు ఇంకేమి భరోసా ఇస్తారని ప్రజలు నవ్వుకుంటున్నారు. ప్రజాబలాన్నే నమ్ముకున్న వైఎస్సార్‌సీపీ హవా ముందు టీడీపీ నాయకుల వ్యూహాలు, దుష్టపన్నాగాలు తేలిపోతున్నాయి.

ఒక స్పష్టమైన విజన్‌తో, నిర్దిష్టమైన ప్రణాళికతో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ప్రకటించిన మేనిఫెస్టోను తూచా తప్పకుండా అమలుచేసి మళ్లీ ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టారు. మరికొద్ది రోజుల్లో మేమంతా సిద్ధం బస్సుయాత్రతో జిల్లాలో అడుగుపెట్టనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న తరుణంలో కీలక ఘట్టమైన నామినేషన్ల దాఖలుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు సర్వసన్నద్ధమయ్యారు. ఈనెల 25వ తేదీలోగా అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు దాఖలు చేయనున్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒకే ఒక్క జాబితాతో టికెట్లన్నీ ఖరారు చేసిన నేపథ్యంలో ఆయన భరోసాతో సమర శంఖం పూరించుతున్నారు. సమరోత్సాహంతో కార్యస్థలిలో అడుగెడుతున్నారు.

పేరు: డాక్టర్ గుమ్మ తనూజారాణి



పార్లమెంట్ నియోజకవర్గం : అరకు
నామినేషన్ వేసే తేదీ: 24.04.2024
నామినేషన్ వేసే ప్రాంతం: పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం
నామినేషన్ వేసే సమయం: ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట మధ్య సమయంలో...

పేరు: పీడిక రాజన్నదొర



అసెంబ్లీ నియోజకవర్గం : సాలూరు (ఎస్టీ)
నామినేషన్ ప్రదేశం: సాలూరు తహసీల్దార్ కార్యాలయం
నామినేషన్ తేదీ: 19.04.2024
నామినేషన్ వేసే సమయం: ఉదయం 11గంటల సమయంలో...

ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సాలూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా 19న సాధారణంగా వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తారు. 24వ తేదీ ఉదయం 10.45 నిమిషాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఊరేగింపుగా వెళ్లి మరోసెట్ నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

పేరు: పాముల పుష్పశ్రీవాణి



అసెంబ్లీ నియోజకవర్గం: కురుపాం (ఎస్టీ)
నామినేషన్ వేసే ప్రదేశం: కురుపాం తహసీల్దార్ కార్యాలయం
నామినేషన్ తేదీ: 19.04.2024
నామినేషన్ సమయం:ఉదయం 10 గంటలకు..

ఉదయం 9 గంటలకు జియ్యమ్మవలస మండలం చినమేరంగిలోనున్న కోటదుర్గమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కురుపాం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నారు.

పేరు: అలజంగి జోగారావు



అసెంబ్లీ నియోజకవర్గం: పార్వతీపురం (ఎస్సీ)
నామినేషన్ వేసే తేదీ 24.04.2024
నామినేషన్ వేసే ప్రాంతం: పార్వతీపురం ఆర్డీఓ కార్యాలయం
నామినేషన్ వేసే సమయం:ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట మధ్యలో...

వైఎస్సార్‌సీపీ పార్వతీపురం నియోజకవర్గ అభ్యర్థిగా అలజంగి జోగారావు భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు.

పేరు: విశ్వాసరాయి కళావతి



అసెంబ్లీ నియోజకవర్గం: పాలకొండ (ఎస్టీ)
నామినేషన్ వేసే ప్రదేశం: ఐటీడీఏ కార్యాలయం, సీతంపేట
నామినేషన్ తేదీ: 19.04.2024 నామినేషన్ సమయం: మధ్యాహ్నం 2.30 గంటలకు..

ఉదయం 9 గంటలకు పాలకొండ శ్రీ కోటదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సీతంపేట చేరుకుంటారు. అక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పూజల అనంతరం ర్యాలీగా సీతంపేట సంత మార్కెట్ నుంచి ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేయనున్నారు.

నామినేషన్ల ప్రక్రియకు సిద్ధం

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- పార్వతీపురం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్ కుమార్



సాక్షి, పార్వతీపురం మన్యం:

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఈ నెల 18న వెలువడనుందని, వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని పార్వతీపురం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గం ఆర్వో నిషాంత్‌కుమార్ తెలిపారు. ఆంధ్రా–ఒడిశా (ఏఓబీ) సరిహద్దు ప్రాంతం కావడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ సంభవించకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మేరకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ 'సాక్షి' ముఖాముఖిలో బుధవారం పలు విషయాలను ఆయన వెల్లడించారు.

అరకు పార్లమెంట్ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలతోపాటు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం, అరకు, పాడేరుకు సంబంధించి పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు పార్వతీపురం కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. నేను ఆర్వోగానూ, సంయుక్త కలెక్టర్ ఏఆర్వోగానూ వ్యవహరిస్తాం. మరో 10 మందితో టీమ్ ఉంటుంది. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశాం. ఎలక్టోరల్స్ అందరికీ ఇచ్చాం. రంపచోడవరంలోని 11 మండలాలకు సంబంధించి పోలింగ్ పూర్తయిన వెంటనే ఈవీఎంలను అక్కడే భద్రపరిచి, కౌంటింగ్ చేపడతాం. పాడేరు, అరకులకు సంబంధించి పాడేరులో లెక్కింపు ప్రక్రియ ఉంటుంది. 70 శాతం వరకు నెట్ సిగ్నల్ సమస్య ఉంటుంది. దీనికితోడు సరిహద్దు, మావోయిస్టు ప్రభావ ప్రాంతాలు కావడంతో అదనపు భద్రతను కోరుతున్నాం. అల్లూరి సీతారామరాజు, మన్యం జిల్లాలు కలిపి 20 వరకూ సీఆర్‌పీఎఫ్ కంపెనీలు ఉన్నాయి. అక్కడి కలెక్టర్, ఎస్పీలతో ఓసారి సమావేశమై సమన్వయం చేసుకుంటాం.

జిల్లాలో నామినేషన్ల సమర్పణ కేంద్రాలు ఎక్కడెక్కడ?



అరకు పార్లమెంట్‌కు సంబంధించి పార్వతీపురం కలెక్టరేట్‌లోని రెండో అంతస్తు వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి సీతంపేట ఐటీడీఏ, పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి పార్వతీపురం ఆర్డీవో కార్యాలయం, సాలూరు నియోజకవర్గం వారైతే సాలూరు తహసీల్దార్ కార్యాలయం, కురుపాం నియోజకవర్గం వారు కురుపాం తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాలి.

నామినేషన్ వేసేటప్పుడు ఎటువంటి నిబంధనలు పాటించాలి?

అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురావాలి. పార్లమెంట్ నియోజకవర్గం కోసం ఫారం–2ఎ, అసెంబ్లీ నియోజకవర్గానికి ఫారం –2బి సమర్పించాలి. పబ్లిక్ సెలవు దినాల్లో మినహా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తాం. అభ్యర్థులు గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. నామినేషన్ల దాఖలు సమయంలో 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా మూడు వాహనాలను అనుమతిస్తాం. అభ్యర్థితో సహా ఐదుగురు వ్యక్తులు లోపలికి రావచ్చు. ర్యాలీగా వచ్చేవారు ముందస్తు అనుమతి తీసుకోవాలి.

ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు చెప్పగలరా?



అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఈ ఏడాది జనవరి 22వ తేదీన విడుదల చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం మన్యం జిల్లాలో 7,75,590 మంది ఓటర్లు ఉన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 7,61,255 మంది ఓటర్లు ఉన్నారు. మన్యం జిల్లాలో 1031, ఏఎస్ఆర్ జిల్లాలో 1021 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం.

ఓటర్లకు మీరిచ్చే సందేశం?

ఎక్కడైనా పోలింగ్ సమయంలో నిబంధనల ఉల్లంఘన జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలి. ఓటర్లు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రధానంగా 18–25 ఏళ్ల యువత ఓటింగ్‌లో పాల్గొనడం లేదు. జీవితంలో గుర్తుండిపోయే ఓటు హక్కును వారు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ఓటు ద్వారా మనకు నచ్చిన నాయకుడిని మనమే ఎన్నుకోవచ్చు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి.

ఎన్నికల సన్నద్ధత ఎంతవరకు వచ్చింది?



జిల్లాలో 1,031 పోలింగ్ కేంద్రాలున్నాయి. 1,230 మంది పీవోలు, 1,230 మంది ఓపీవోలను నియమించి వారికి ఒక దఫా శిక్షణ పూర్తి చేశాం. ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించి అవసరమైన శిక్షణ ఇచ్చాం. మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తయ్యింది. ఈ ప్రకారం ఈవీఎలను నియోజకవర్గాలకు తరలించి భద్రపరిచాం. మొత్తం 1,235 బ్యాలెట్‌లు, 1,235 కంట్రోల్ యూనిట్లు, 1,238 వీవీప్యాట్లను తరలించాం. పాలకొండ (ప్రభుత్వ జూనియర్ కళాశాల), కురుపాం(ప్రభుత్వ జూనియర్ కళాశాల), పార్వతీపురం(ప్రభుత్వ కళాశాల), సాలూరు (ప్రభుత్వ కళాశాల)లలోని స్ట్రాంగ్ రూమ్స్‌లో వాటిని భద్రపరిచాం. 24 గంటలూ పూర్తి భద్రత ఉంటుంది. సాలూరు నియోజకవర్గం పరిధి మెంటాడలో 50 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడ 50 మంది ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది అవసరం. పోలింగ్ సిబ్బందిని విజయనగరం జిల్లా అధికారులు చూసుకుంటారు. ఎన్నిక ముగిసిన తర్వాత ఈవీఎంల తరలింపు, లెక్కింపు ప్రక్రియ మన్యం జిల్లాలోనే జరుగుతుంది. మొత్తంగా ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నాం.

నిఘా విభాగాలు ఎలా పని చేస్తున్నాయి?



48 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశాం. ప్రతి మండలానికీ మూడు టీమ్‌లు 24 గంటలూ పనిచేస్తాయి. సి-విజిల్‌లో ఇప్పటి వరకు 91 ఫిర్యాదులు రాగా..90 పరిష్కరించాం. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్‌రూం 24 గంటలూ పనిచేస్తోంది. 1950 నంబరుకు 21 ఫిర్యాదులు, మీడియా నుంచి 39 ఫిర్యాదులు వచ్చాయి. మొత్తంగా 342 ఫిర్యాదులు రాగా.. ఎన్నికల కమిషన్ పోర్టల్‌లో నమోదైన 171 ఫిర్యాదుల్లో 166 పరిష్కారమయ్యాయి. మరో మూడు విచారణలో ఉన్నాయి. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారంపైనా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 10 వరకు చెక్‌పోస్టులు పెట్టాం. అక్రమ రవాణాదారుల నుంచి 22,246 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశాం. 28.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం.

85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటు అవకాశం ఉందా?



85 ఏళ్లు పైబడి, 40 శాతం వికలాంగత్వం దాటిన వారికి ఇంటి నుంచే పోస్టల్ బ్యాలెట్ రూపంలో ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. ఇటువంటి వారు జిల్లాలో 16 వేల వరకూ ఉన్నట్లు గుర్తించాం. దరఖాస్తులు 400 వరకే వచ్చాయి. ఎవరైనా వస్తే అవకాశం కల్పిస్తాం.

కనుల పండువగా..

రమణీయ రూపుడు శ్రీరామచంద్రుడు..కమనీయ కాంతులతో జానకి మాత..వరమాలలతో కల్యాణ వేదికపైకి అరుదెంచిన సమయాన..కల్యాణ ఘడియలు దగ్గర పడిన వేళ..భక్తజనం కనులారా తిలకించేందుకు తోటపల్లి చేరుకున్నారు. కల్యాణ క్రతువును ఆద్యంతం తిలకించిన భక్తజనం అభిజిత్ లగ్నంలో శ్రీరాముడు జానకి మెడలో తాళిబొట్టు కడుతున్న సుందర ఘట్టాన్ని వీక్షించి తమ జన్మ ధన్యమైందని ఆనంద బాష్పాలు రాల్చారు. ఆదిదంపతుల అద్భుతమైన వివాహ ఘట్టాన్ని మదినిండా ప్రోది చేసుకుని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి భక్తి తన్మయత్వంలో మునకలేశారు.

- సీతారాముల పెళ్లి వేడుక
- తోటపల్లికి తరలివచ్చిన భక్తజనం





స్వామివారి కల్యాణంలో పాల్గొన్న దంపతులు (ఇన్‌సెట్లో) స్వామివారి కల్యాణ వేడుకలో భాగంగా మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకులు

గరుగుబిల్లి:

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో బుధవారం శ్రీ సీతారామస్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ నేపథ్యంలో ఉదయం అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడికి శ్రీరామ సుప్రభాత సేవ, ఆరాధన, మంగళాశాసనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, మత్సంగ్రహణం, అంకురారోపణం తదితర పూజాకార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీసీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు వీవీ.అప్పలాచార్యులు సీతారామస్వామి కల్యాణం జరిపించారు. స్వామివారి కల్యాణంలో పరిసరగ్రామాలకు చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. పూజాసామగ్రి, స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులు, అర్చకులకు దీక్షావస్త్రాలను పలువురు దాతలు సమకుర్చారు. భక్తులకు పానకం, వడపప్పు, పులిహోరను వితరణ చేశారు. అనంతరం కల్యాణ వేడుకకు హాజరైన భక్తులకు ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే కల్యాణంలో పాల్గొన్న దంపతులకు ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆలయ సిబ్బంది అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈఓ వీవీ.సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ ఎం.సత్యనారాయణ, కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. అనంతరం సాయంత్రం శ్రీస్వామివారి పట్టాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

చేగొడియాలు చేసేస్తా.. ఓటర్లను మెప్పిస్తా..



చేగొడియాల తయారీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ రాజాం మున్సిపాల్టీ పరిధిలోని చెరువుగట్టు వార్డులో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఒక వీధిలోని అగ్నిగంగమ్మ చేగొడియాలు ఫ్యాక్టరీలో మహిళలతో కలసి చేగొడియాలు తయారుచేస్తూ ప్రచారం చేపట్టారు. జగనన్న తోడు, చేదోడు, ఆసరా, చేయూత వంటి పథకాలతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పించారని, ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి మరోసారి సీఎంను చేయాలని కోరారు.

అంబకండి అయ్యప్ప ఆలయంలో పూజలు



అంబఖండి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామ అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామికి అభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకులు రేజేటి సత్తిబాబుశర్మ, వంశీకృష్ణ శర్మ భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆకట్టుకున్న వర్ణచిత్రం

ప్రముఖ నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు వేసిన చిత్రాలు జీవం పోసినట్లు ఉండటంతో ఈ ప్రాంతంలో పలువురు మన్ననలు పొందుతున్నారు. మండలంలోని నాగూరుకు చెందిన ఈయన వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ, చిన్నతనం నుండి గోటితో దేశ నాయకులు, దేవతామూర్తుల చిత్రాలను వేసి ఔరా...! అని పలువురిచే కీర్తించబడుతున్నారు. శ్రీరామనవమి సందర్భంగా వేసిన సీతారాముల వర్ణచిత్రం ఆకర్షణీయంగా నిలిచింది.

–గరుగుబిల్లి



క్లుప్తంగా

నేత్రదానంతో పునర్జన్మ



వరహాలమ్మ నుంచి కార్నియాను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి అమ్మవారి కాలనీకి చెందిన పెంకి వరహాలమ్మ (80)నేత్ర దానంతో పునర్జన్మ పొందింది. బుధవారం ఆమె మృతి చెందడంతో కుమారులు పెంకి గౌరీశ్వరరావు, వెంకటరావు, మనుమడు పెంకి చైతన్యకుమార్‌లు ఆమె నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో శ్రీకాకుళం రెడ్‌క్రాస్‌కు సమాచారం అందించారు. వరహాలమ్మ నుంచి సేకరించిన కార్నియాను విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి అందించనున్నామని మగటపల్లి శ్రీధర్ నేత్ర సేకరణ కేంద్రానికి చెందిన టెక్నీషియన్ కల్యాణి తెలిపారు. నేత్రదానానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్‌తో పాటు పట్టణవాసులు అభినందించారు.

నగదు స్వాధీనం



చెక్‌పోస్టు వద్ద స్వాధీన పర్చుకున్న నగదుకు సంబంధించి రసీదు అందిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని చిన మంగళాపురం కూడలి(విశాఖ రహదారి)లో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టు వద్ద ఎన్నికల నిర్వహణ ఫ్లయింగ్ స్క్వాడ్ బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో విజయనగరం నుంచి వస్తున్న స్వస్తిక్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెంటు వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రూ.2లక్షల 50వేలను స్వాధీనపర్చుకున్నారు. సదరు నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచిస్తూ అధికారులు రసీదును అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరరావు

రాజాం సిటీ: పట్టణ పరిధి జీఎంఆర్ ఐటీ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పాలకొండ వైపు నుంచి రాజాం వస్తున్న ద్విచక్ర వాహనం, రాజాం నుంచి పాలకొండ వైపు వెళ్తున్న ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న పాలకొండకు చెందిన బంకి సంపత్‌కు కాలి మడమకు తీవ్ర గాయాలు కాగా, వెనుక ఉన్న సంతకవిటి మండలం చిన్నయ్యపేటకు చెందిన చిత్తిరి ఈశ్వరరావు కుడికాలు విరిగిపోయింది. వీరిని స్థానికులు 108 ద్వారా జీఎంఆర్ కేర్‌కు తరలించి చికిత్సనందించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సంతకవిటి ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

అన్వేషిక సైన్స్ సెంటర్ ప్రారంభం

విజయనగరం అర్బన్: భౌతిక శాస్త్రంలోని ప్రయోగాలను సులభంగా అర్థం కావడానికి అవసరమైన అన్వేషిక సైన్స్ సెంటర్‌ను స్థానిక కామాక్షినగర్‌లో కాన్పూర్ నుంచి వర్చువల్ ద్వారా పద్మశ్రీ ప్రొఫెసర్ హెచ్‌సీ వర్మ బుధవారం ప్రారంభించారు. నేషనల్ అన్వేషిక నెట్వర్క్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ డేను పురస్కరించుకొని నూతనంగా ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షులు, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ జోగా చంద్రశేఖరరావు తెలియజేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్వేషిక సెంటర్లతో అనుసంధానం చేసి విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాలలో అభిరుచిని, ఆసక్తి, పెంపొందించడానికి ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు భౌతిక శాస్త్రంలోని కఠినతర అంశాలను సులుభతరంగా ప్రయోగాత్మకంగా చెప్పి నేర్పించడం ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు. అన్వేషిక సెంటర్ ప్రయోజనాలను సంబంధిత ఫిజిక్స్ లెక్చరర్స్ విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఖాళీ సమయంలో సెలవు సమయాల్లోనూ అన్వేషిక సెంటర్ తెరచి ఉంటుందన్నారు. నిత్య జీవితంలో జరిగే ఉదాహరణలు తీసుకుని భౌతిక శాస్త్రాన్ని బోధించినట్లయితే విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం భౌతిక శాస్త్ర అంశాలకు సంబంధించిన పలు ప్రయోగాలను చేసి చూపించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయిన శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ డీబీ రాధాకృష్ణమూర్తికి 'అన్వేషిక ఆచార్య అవార్డు-2024' పురస్కారంతో ఘనంగా సత్కరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

ఇదే..మొదటిసారి..!

- సీతంపేట ఐటీడీఏలో నామినేషన్ల స్వీకరణ
- నేడే ఎన్నికల నోటిఫికేషన్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఏర్పడి ఐదు దశాబ్దాలైంది. ఇప్పటి వరకు ఇక్కడ ఎటువంటి ఎన్నికల కార్యకలాపాలు నిర్వహించలేదు. తొలిసారిగా 2024 సార్వత్రిక ఎన్నికలకు సబంధించిన నామినేషన్ల ప్రక్రియ ఇక్కడి ఐటీడీఏలో జరగనుంది. ఈ ఐటీడీఏ అన్నిరకాల మౌలికవసతులు కలిగి ఉండడం, ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కావడంతో సీతంపేట ఐటీడీఏలో నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈనెల 18న సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. దీనిలో భాగంగా నామినేషన్ల పర్వం ఐటీడీఏలోనే కొనసాగనుంది. అధికారులు ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

నామినేషన్ల దాఖలు..

రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం నుంచి వంద మీటర్ల పరిధిలోకి మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారు. అభ్యర్థితో సహా ఐదుగురు వ్యక్తులకు మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుంది.

నామినేషన్ పరిశీలన..

అభ్యర్థి, ఎన్నికల ఏజెంట్, ఒక ప్రతిపాదికుడు, మరో వ్యక్తి (న్యాయవాది కావచ్చు) పరిశీలనకు వెళ్లవచ్చు. దీనికి అభ్యర్థి రాతపూర్వకంగా అనుమతి ఇవ్వాల్సిన అవసరం ఉంది.



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

మార్గదర్శకాలివే..

అభ్యర్థి కాని పార్టీ కాని కులమత భాషా విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం, ప్రసంగించడం చేయరాదు. విధానాలు, కార్యక్రమాలపై ప్రసంగాలు, విమర్శలు ఉండాలి. వ్యక్తిగత జీవితంపై విమర్శలు ఉండకూడదు. కుల, మత ప్రాతిపదికపై ఓటు అడగకూడదు. ప్రార్థనా ప్రదేశాలను ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగించకూడదు. ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, బెదిరించడం నిషేధం. యజమానులు లేకుండా వారి భూమి, బిల్డింగులను ప్రచారానికి ఉపయోగించరాదు. ఇతర పార్టీ ఎన్నికల ప్రచార మీటింగ్‌లకు ఆటంకం కలిగించరాదు.

ప్రచారం నిబంధనలు

విద్యాసంస్థలు, వాటి మైదానాలను ప్రచారానికి వాడకూడదు. ప్రైవేట్ భూములు, భవనాల యజమానుల లిఖితపూర్వక అనుమతి తీసుకుని పత్రాలను రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఇచ్చాకే వాల్‌పోస్టర్లు అంటించాలి. కరపత్రాలు, పోస్టర్లపై ముద్రణాలయాల పేరు, చిరునామా ముద్రించాలి. ప్రచారంలో భాగంగా టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు. అయితే వాటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. దేవుళ్ల ఫొటోలు, అభ్యర్థి ఫొటోలతో డైరీలు, క్యాలెండర్‌లను ప్రచురించరాదు. వాహనాల స్టెఫినీ కవర్లపై కుల, మత సంబంధిత ఫొటోలు, అభ్యర్థి ఫొటోలు ఉండడానికి వీలులేదు. ఎన్ని వాహనాలైనా ఎన్నికల ప్రచారానికి వినియోగించవచ్చు. అయితే రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకుని ఒరిజనల్ అనుమతి పత్రాన్ని వాహనానికి అంటించాలి. ఇంకొకరు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటారు.

తాత్కాలిక కార్యాలయాల ఏర్పాటు

ప్రార్థనా స్థలాలు, పాఠశాలలు, పోలింగ్ స్టేషన్లకు 200మీటర్ల మీటర్లలోపు అభ్యర్థుల తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు చేయకూడదు. కార్యాలయంపై పార్టీ జెండా, బ్యానర్, పార్టీ చిహ్నాన్ని పెట్టుకోవచ్చు. రాత్రి 10 గంటల తర్వాత ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు. రాత్రి 10 గంటల తర్వాత పబ్లిక్ మీటింగ్‌లు నిలిపివేయాలి.

కూటమిని తరిమికొడదాం



లివిరి గ్రామ టీడీపీ నాయకులకు కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ లోకి ఆహ్వానిస్తున్న పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

- పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి
- వైఎస్సార్‌సీపీలో చేరిన 20 టీడీపీ కుటుంబాలు

వీరఘట్టం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు అందనీయకుండా అడ్డుపడుతున్న టీడీపీ కూటమని మే 13న జరగనున్న ఎన్నికల్లో తరిమికొడదామని పాలకొండ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భామిని మండలంలోని లివిరి గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వీరఘట్టం మండలంలోని వండవ గ్రామంలో ఆమె పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. లివిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గౌడు చంటి, బిరాట్, గోపాల్, సంతోష్, కైలాష్, చౌదరి, చిన్ని, బలక,నరేష్, రాము,రమేష్, బుల్లు,కన్నా, మల్లేష్, చక్రపాణి, శ్రీధర్, మిట్టు, సురేంద్ర, నరేంద్ర,ప్రకాశ్ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎదురుగా నిలబడి ఎదిరించే దమ్ములేని ప్రతిపక్షాలు చివరకు ఆయనపై హత్యాయత్నానికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. అధికార దాహంతో ప్రతిపక్ష నేతలు నిత్యం ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకుని పచ్చమీడియాతో తప్పుడు రాతలు రాయిస్తున్నారని విమర్శించారు. ఎన్ని గిమ్మిక్కులు చేసినా ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. ఈనెల 19న సీతంపేటలో నామినేషన్ వేయనున్నామని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భామిని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు గెల్లంకి రమేష్‌తో పాటు లివిరి గ్రామసర్పంచ్, ఎంపీటీసీ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

- అరకు పార్లమెంట్ నియోజకవర్గం ఆర్‌ఓ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లుచేసి సిద్ధగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో గల సహాయ రిటర్నింగ్ అధికారులు, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ అంతర్‌రాష్ట్ర సరిహద్దులవద్ద గట్టి నిఘా ఏర్పాటుచేయాలని, చెక్‌పోస్టులు నిరంతరం పనిచేయాలని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, వీడియో వ్యూయింగ్ బృందాలు పటిష్టంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి లోపాలు జరగకుండా ప్రశాంతంగా, సజావుగా జరగాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన అనుమతులకు సువిధ పోర్టల్‌లో అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అందుకు ఒక నోడల్ అధికారిని నియమించామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత మాట్లాడుతూ అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పాడేరు, అరకు, రంపచోడవరం శాసనసభ నియోజకవర్గాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. అరకు, పాడేరు, రంపచోడవరంలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రంపచోడవరం గురుకుల పాఠశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, అరకు, పాడేరు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి పాడేరులో లెక్కింపు జరుగుతుందని వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఎస్‌డీసీ ఆర్‌వీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్‌కుమార్

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఐటీడీఏ పీఓ

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్‌ను ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల రికార్డులు తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభంకానున్న నేపథ్యంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయ సమీపంలో బారికేడ్లు తదితర ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



సీసీ కెమెరాల ఏర్పాటు, పనితీరును పరిశీలిస్తున్న ఆర్‌ఓ, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

జిల్లా ఓటర్లు 7,75,598 మంది

పార్వతీపురం: అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 22 జనవరి 2024 నాటికి విడుదల చేసిన తుది ఓటరు జాబితా మేరకు పార్వతీపురం మన్యం జిల్లా ఓటర్లు 7,75,598 మంది కాగా పురుషులు 3,78,764 మంది, మహిళలు 3,96,766మంది, థర్డ్ జెండర్స్ 68మంది ఉన్నారు. అలాగే అల్లూరు సీతారామరాజు జిల్లాలో 7,61,255మంది ఓటర్లు ఉండగా వారిలో 3,66,386మంది పురుషులు, 3,94,832మంది మహిళలు, 37మంది థర్డ్ జెండర్స్ ఉన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
పాలకొండ(ఎస్టీ)	94,328	99,325	14	1,93,667
కురుపాం(ఎస్టీ)	93,592	99,005	39	1,92,636
పార్వతీపురం(ఎస్సీ)	92,655	95,188	11	1,87,854
సాలూరు(ఎస్టీ)	98,189	1,03,248	4	2,01441
మొత్తం	3,78,764	3,96,766	68	7,75,5 98

అల్లూరి సీతారామరాజు జిల్లాలో..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్స్	మొత్తం
పాడేరు	1,18,154	1,26,755	16	2,44,925
అరకు	1,17,460	1,23,894	6	2,41,360
రంపచోడవరం	1,30,772	1,44,183	15	2,74,970
మొత్తం	3,66,386	3,94,832	37	7,61,255



రిటర్నింగ్ అధికారులు

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిగా నిషాంత్‌కుమార్ ఉన్నారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికను నియమించారు. అలాగే శాసన సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారులను ఇలా నియమించారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో 1031 కేంద్రాలు, అల్లూరు సీతారామరాజు జిల్లాలో 1021 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

శాసనసభ నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు
పాలకొండ	287
కురుపాం	268
పార్వతీపురం	233
సాలూరు	243
అరకు	304
పాడేరు	318
రంపచోడవరం	399

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి
పాలకొండ	కల్పనాకుమారి (సీతంపేట ఐటీడీఏ పీఓ)
సాలూరు	సి. విష్ణుచరణ్ (పార్వతీపురం ఐటీడీఏ పీఓ)
పార్వతీపురం	కె. హేమలత (పార్వతీపురం ఆర్డీఓ)
కురుపాం	వి.వెంకటరమణ (పాలకొండ ఆర్డీఓ)
పాడేరు	భావన వశిష్ఠ (అల్లూరు సీతారామరాజు జేసీ)
అరకు	వి. అభిషేక్ (పాడేరు ఐటీడీఏ పీఓ)
రంపచోడవరం	ఎస్.ప్రశాంత్ కుమార్ (రంపచోడవరం సబ్‌కలెక్టర్)

జగదానందకారకా..

- వైభవంగా సీతారాముల పరిణయం
- కనులారా వీక్షించి పులకించిన భక్త జనం
- జై శ్రీరామ్ అంటూ మార్మోగిన రామతీర్థం



సీతారాముల కళ్యాణ వైభవం

నెల్లిమర్ల రూరల్: జై శ్రీరామ్ నామంతో రామతీర్థం పులకించింది. భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణ నడుమ సీతారామచంద్రస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దశరథ పుత్రుడు శ్రీరామచంద్రస్వామి వారి పెళ్లి తంతు కొనసాగింది. సరిగ్గా 12 గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామివారు సీతమ్మతల్లి మెడలో మాంగళ్యధారణ చేశారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించేందుకు వచ్చిన అశేష భక్తజనులు మహాఘట్టాన్ని చూసి తరించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. 3 గంటలకు ఆరాధన, బాలభోగం, సేవాకాలం కార్యక్రమాలను నిర్వహించారు. 6 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి చేపట్టారు. తరువాత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు.

సిరి కల్యాణపు బొట్టును పెట్టి...

కల్యాణ మండపం మధ్య భాగంలో అమ్మవారిని, స్వామివారిని ఆశీనులను చేశారు. శ్రీరామచంద్ర ప్రభువుకు ఏకాంతంగా అవతార సర్గ విన్నపం నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణులకు అత్యంత వైభవంగా పాలు, పెరుగు, నెయ్యి, తేనె, ఫల రసాలు, సముద్ర నదీ జలాలతో అభిషేకం చేశారు. అర్చకస్వాములు ప్రతీ తంతుకు వేద మంత్రాన్ని పఠిస్తూ కల్యాణ ఘట్టాన్ని కొనసాగించారు. కల్యాణ తంతులో భాగంగా స్వామివారికి 'కన్యావరణ' 'యజ్ఞోపవీతధారణ' జరిపించారు. వధూవరుల వంశ గోత్ర నామాలను ప్రవచించారు. ఆశీర్వచనం, పాదప్రక్షాళనం, పుష్పోదకస్నానం నిర్వహించి వరపూజ చేశారు. అనంతరం స్వామివార్లకు నూతన వస్త్రాలంకరణ చేశారు.

జీలకర్ర-బెల్లం

వేద పండితులు వేద మంత్రోచ్ఛరణ చేస్తూ సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారామ స్వామి వార్ల శిరస్సుపై ఉంచారు. అనంతరం అర్చకస్వాములు మంత్రాలను జపిస్తూ శాస్త్రోక్తంగా సాక్షాత్తు సీతమ్మ తల్లి మంగళసూత్రాలను భక్తజనులకు చూపించి మాంగళ్యధారణ గావించారు. కల్యాణం జరుగుతున్నంత సేపు నంద్యాలకు చెందిన వ్యాఖ్యాతకర్త సుదర్శన జీవీ హాయ గ్రీవాచార్యులు స్వామివారి కల్యాణ గొప్పతనాన్ని భక్తులకు వివరించారు.

ఆణిముత్యములే తలంబ్రాలుగా...

కల్యాణ ఘట్టం అనంతరం ప్రధాన ఘట్టమైన తలంబ్రాల వేడుక కనులపండువగా సాగింది. గోటితో ఒలిచిన పవిత్ర తలంబ్రాల్లో మంచిముత్యాలు కలిపి సీతారాముల శిరస్సుపై నుంచి వేశారు. అర్చకుల వేద మంత్రోచ్ఛరణ నడుమ తలంబ్రాల సేవను జరిపించారు. కల్యాణ వేడుక జరుగుతున్నంత వరకు ప్రాంగణమంతా రామనామస్మరణతో మార్మోగింది. కల్యాణం అనంతరం స్వామివారి తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను తీసుకొని భక్తులు తిరిగి పయనమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పట్టువస్త్రాలను సమర్పించిన సింహాచలం ఈఓ..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున సింహాచలం దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి నవమి వేడుకులకు హాజరై తిరుపతి, సింహాచలం దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలు, తలంబ్రాలు స్వామివారికి సమర్పించారు. విశాఖ, విజయనగరం జిల్లా న్యాయమూర్తులు గిరిధర్, చక్రవర్తి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఝాన్సీ దంపతులు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, శ్రీరాములనాయుడు దంపతులు, జేసీ కె.కార్తీక్, ఆర్డీఓ సూర్యకళ తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారామ స్వామివారికి ఆనవాయితీగా పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం కల్యాణవేదిక వద్ద వేంచేసి ఉన్న సీతారాములను దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. సతివాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఈఓ శ్రీనివాసరావు, శ్రీనివాసనంద సరస్వతి, శ్రవణ చైతన్య చినస్వామీజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆదుకుంటున్న అపర సంజీవని

- లక్షలాది మందికి సేవలందిస్తున్న 108 వాహనాలు



108 అంబులెన్సులో గర్భిణిని తరలిస్తున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, పురిటినొప్పులు వచ్చే సమయంలో ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లే గర్భిణులు, ఊపిరి ఆడక ఇబ్బంది పడే రోగులు, పాము కాటుకు గురైన బాధితులు, గుండెపోటు, పక్షవాతం వచ్చిన వారు, తీవ్రమైన కడుపు నొప్పి ఇలా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చి 108 అంబులెన్సు పునర్జన్మ ప్రసాదిస్తోంది. గడిచిన ఐదేళ్లలో లక్షలాది మందికి 108 అంబులెన్సుల ద్వారా సిబ్బంది సేవలు అందించారు. శిథిలావస్థకు చేరిన 108 అంబులెన్సులను

2019లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మార్చేసి అత్యాధునిక వసతులతో కూడిన కొత్త అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అంతేకాకుండా నవజాత శిశువుల కోసం నియోనేటల్ ప్రత్యేక అంబులెన్సును అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆపద జరిగిందని ఫోన్ వచ్చిన క్షణాల్లో సంఘటన స్థలానికి కుయ్‌కుయ్ మంటూ 108 అంబులెన్సు వాలిపోయి బాధితులను అస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడుతోంది.



మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న దశ్యం

కొత్త వాహనాలను జిల్లాలో 2020 లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 2,17,460 మందికి సేవలు అందించారు. ఏడాదికి 50 వేల నుంచి 80 వేల మంది 108 అంబులెన్సుల సేవలు పొందుతున్నారు.